"నిక్షేపం లాంటి సంబంధం. ఇంక పూరికే తటపటాయించకండి. కుర్రాడు బుద్ధిమంతుడు. దురలవాట్లు ఏవీ లేవు. బెంగుళూరు మహానగరంలో ఉంటున్నా భాస్కరానికి కనీసం సిగరెట్లయినా అలవాటు కాలేదు. నెలకి పన్నెండు వందల దాకా సంపాదిస్తున్నాడట. వాళ్ళ నాన్నకి ప్రతి నెలా ఖచ్చితంగా వంద రూపాయలు మనియార్డరు పంపిస్తాడు. పైన మూడొందలో, నాలుగొందలో బ్యాంకులో వేస్తాడు. అయినా అతన్ని గురించి నేను మీకు చెప్పడం ఏమిటి? నా కంటే మీకే బాగా తెలిసి ఉండాలి. అతనూ, మీ అబ్బాయీ చిన్నప్పుడు కలిసి చదువుకున్నారాయె. ఏరా అంటే ఏరా అనుకునేటంత చనువు గల వాళ్ళాయె. ఆ పరంధామయ్యగారూ, మీరూ చిన్నప్పటినించీ స్నేహితులాయె."

"శాస్త్రుల్లుగారూ, ఆ విషయాలన్నీ నేను కాదన్నానా? వాళ్ళ కుటుంబం గురించి సంప్రదాయం గురించి మాకు తెలీని దేముంది? మూడు సంవత్సరాల నుంచి సంబంధాల కోసం తిరిగి తిరిగి విసుగెత్తి పోయింది. బి. ఎ. పాసైన ఓ నాలుగొందలు సంపాదిస్తుంటే చాలు ఏడు వేలిస్తావా, పది వేలిస్తావా అని బేరాలు. నేనా నాలుగైదు వేలకంటే తూగలేను. అలా అని చూస్తూ చూస్తూ నిక్షేపం లాంటి పిల్లని ఎస్సెల్సీ తప్పిన వాడికి ఇవ్వనూ లేను. భాస్కరం ఎమ్. ఎ. పాసై బెంగుళూరులో ఉంటూ సంపాదిస్తున్నాడు కదా— కనీసం పది వేలైనా అడక్కపోతాడా అని నేనూ ఇన్నాళ్ళూ అతని సంగతి ఆలోచించలేదు. ఇప్పుడు అతను కట్నం లేకుండా చేసుకుంటానని చెప్పాడంటున్నారు కనక మాకు మాత్రం అంతకంటే కావలిసిందేముంది? కాని అతను చేసే ఉద్యోగమో, వ్యాపారమో అదేమిటో తెలుసుకోకుండా సంబంధం ఎలా నిశ్చయం చేయగలం, చెప్పండి? దయచేసి ఆ ఒక్క విషయం మీరు కనుక్కోగలిగితే మీ మేలు ఈ జన్మలో మరిచిపోలేను. ఏదో అదృష్టం కొద్దీ అతనొచ్చాడు. ఇంకో రెండు మూడు రోజులుంటాడంటున్నారు. కనక ఈ లోగానే అన్నీ తేల్చేసుకుని, తాంబూలాలు పుచ్చేసుకుంటే మనస్సుకి నెమ్మదిగా ఉంటుంది. అతను మళ్ళీ బెంగుళూరు వెళ్ళిపోతే ఇంక పట్టుకోలేము. మళ్ళీ ఏడాదికో, రెండేళ్ళకో కాని రాడు. ఆరొందల మైళ్ళు ప్రయాణం చేసి మనం అక్కడికి వెళ్ళనూ లేము. మీరు ఇంకొక్కసారి వెళ్ళి ప్రయత్నించండి శాస్త్రుల్లుగారూ. ఎలాగైనా అతని వ్యాపార రహస్యం మాత్రం కనుక్కోండి."

"ఆ పని మాత్రం నా వల్ల కాదు, రామనాథంగారూ. నా శాయశక్తులా ప్రయత్నించాను. ఎన్నో రకాలుగా అడిగి చూశాను. లాభం లేకపోయింది. అతను చాలా ముక్కుసూటి మనిషి. చెప్పదలుచుకున్న దాన్ని అవతలి వాళ్ళకి కష్టం కలిగినా సరే కుండబద్దలు కొట్టినట్లు చెప్పేస్తాడు. మనం డొంక తిరుగుడుగా మాట్లాడినా, కూపీ లాగుతున్నట్లుగా మాట్లాడినా అతనికి చిర్రెత్తుకొస్తుంది. ఎమ్. ఎ. పాసైన తరవాత ఒక ఆర్నెల్లు ఉద్యోగం కోసం ప్రయత్నించి లాభం లేక ఇందిరా గాంధి సలహా ప్రకారం స్వయం ఉపాధి పథకం అమల్లో పెట్టాడట. ఒకళ్ళ చుట్టూ ప్రదక్షిణాలు చేయడం ఇష్టంలేక తన వ్యాపారం తనే పెట్టుకున్నాడు. రెండు చేతులా సంపాదిస్తున్నాడు. మీ ప్రభాకరం చూడండి. బి. ఏ. పాసై ఐదేళ్ళుగా ఉద్యోగం లేకుండా ఇంట్లో కూచున్నాడా? అంతకంటే భాస్కరం చేసిన పని మంచిదంటారా? కాదంటారా? ఎటొచ్చీ ఆ వ్యాపారం ఏమిటో ససేమిరా చెప్పనంటున్నాడు. అంతేకదా? మీ అబ్బాయికైనా చెప్పలేదు. సొంత తల్లి తండ్రులకే చెప్పని వాడు ఇంకోసారి అడిగితే మాత్రం నాకు చెబుతాడా? రెట్టించి అడిగితే అసలు ఈ సంబంధమే వద్దు పొమ్మంటాడు. మీ అమ్మాయిని చేసుకోవాలని అతను మోజు పడ్డ మాట నిజమే కానీ, దాన్ని ఆసరా చేసుకుని మీరు తన రహస్యం లాగడానికి ప్రయత్నిస్తున్నారని తెలిస్తే మాత్రం అతను పెంకె ఘటంగా తయారవుతాడు. అయినా అతని వ్యాపార రహస్యం తెలుసుకోవాలని మీకు అంత పట్టుదల అనవసరం అనుకుంటా."

"తలిదండ్రులకికూడా చెప్పకుండా రహస్యంగా ఉంచాడంటే, ఆ వ్యాపారంలో ఏదో లొసుగు ఉంటుందేమోనని నా అనుమానం. పన్నెండొందలు సంపాదిస్తున్నాడా, పద్దెనిమిదొందలు సంపాదిస్తున్నాడా అనేది ముఖ్యంకాదు. ఎలా సంపాదిస్తున్నాడనేది ముఖ్యం. బ్రాకెట్లు ఆడి సంపాదిస్తున్నాడా గుర్రప్పందాలు ఆడుతున్నాడా, లాటరీలు కొడుతున్నాడా అనేది తెలుసుకోవద్దటండీ?"

"కుర్రాణ్ణి గురించి మీకు అటువంటి అనుమానాలేమున్నా ఉంటే, అసలు ప్రయత్నించడం అనవసరం. ఎందుకంటే, అతను ససేమిరా చెప్పడు. మీకు అనుమానం తీరదు. అనుమానంతో ఏ పని చేసినా మనస్సుకు శాంతి ఉండదు."

"అబ్బే. అదికాదు, శాస్త్రుల్లుగారూ. అతను బుద్ధిమంతుడనే నమ్మకం ఇప్పటికీ ఉంది నాకు. కాని, అతని సంగతేమిటో తెలుసుకోవాలి. ఎలాగైనా నేనే ప్రయత్నించి తెలుసుకుంటాను. తాంబూలాలు పుచ్చుకునేటప్పుడు మళ్ళీ మీకు కబురు చేస్తాను."

"సరే, మంచిది. నేను వెళ్ళొస్తాను. మీరు సాధించగలిగితే అంతకంటే కావలిసిందేముంది?"

• • • •

శాస్త్రులుగారు వెళ్ళిన తరవాత రామనాథంగారు కూపీ లాగడంలో కొడుక్కి తర్ఫీదు ప్రారంభించాడు. ఉపదేశం మొదలుపెడుతుండగానే ప్రభాకరం "అబ్బే! లాభం లేదు, నాన్నా" అనేశాడు. "వాడు మొండి ఘటం. అడిగ్గాచ్చినా చెప్పడు. 'నీ వ్యాపారం ఏమిటో చెప్పరా, నా తాహతుకు తగినదైతే నేనూ పెడతాను' అని ఎన్నోసార్లు అడిగాను. 'నీకు పోటీ రాకుండా వ్యాపారం హైదరాబాద్‌లో పెడతారా, నాయినా' అనికూడా చెప్పాను. వాడు కొస్తకూడ మెత్తబడలేదు. వాడివ్యాపారం సంగతి తప్ప మిగతా విషయాలన్నీ సరదాగానే మాట్లాడతాడు" అన్నాడు.

"నీది వట్టి మట్టి బుర్రరా. నేరుగా అడిగితే చెప్పనప్పుడు లౌక్యంగా మాటల్లోకి దింపి, కూపీ లాగాలి. నువ్వు కూపీ లాగుతున్నట్టు అతనికి ఏ మాత్రం అనుమానం రాకుండా మాట్లాడాలి. ఏక ధాటిగా క్రాస్—ఎగ్జామినేషన్ చేస్తున్నట్లు కాక తాపీగా, సరదాగా మాట్లాడాలి. ఏదో ఉబుసుపోకకు మాట్లాడుతున్నట్లుగా అతనికి అనిపించాలి" అంటూ రామనాథంగారు సాయంత్రం దాకా కొడుక్కి ట్రైనింగు ఇచ్చాడు.

ట్రైనింగు పూర్తయేసరికి ప్రభాకరం బుర్ర సానబట్టిన వజ్రంలా తయారయింది.

• • • •

సాయంత్రం ప్రభాకరం, భాస్కరం పూరి కొబ్బరితోపుల్లోకి షికారుకి వెళ్ళారు. భాస్కరం అప్పటికే వేగు కనిపెట్టే ఉంటాడు. ప్రభాకరం వాలకం చూడగానే పసి గట్టేశాడు, అతగాడు కూపీ లాగే ప్రయత్నంలో వచ్చాడని. నిజానికి అప్పటికింకా ప్రభాకరం క్రాస్ ఎగ్జామినేషన్ ప్రారంభించనే లేదు. అనుమానించడానికి ఆధారాలేవీ అతని మొహంలో కనిపించ లేదుకూడా. అయినా అతని నడతని బట్టి మామూలుగా కంటే సరదాగా కనిపించడానికి అతను చేస్తున్న ప్రయత్నాన్ని బట్టి భాస్కర్ గ్రహించేశాడు ఏదో విశేషం ఉందని. అయినా తను

# వ్యాపార రహ

# సంటూరి పార్థసా

గ్రహించినట్లు ప్రభాకరానికి ఏమాత్రం తెలియనివ్వలేదు. భాస్కరం పసిగట్టేశాడని ప్రభాకరం ఎంత మాత్రం అనుమానించ లేదు. ఎందుకంటే తండ్రి ఇచ్చిన తర్ఫీదు వల్ల అతను గొప్ప ఆత్మవిశ్వాసంతో ఉన్నాడు.


పొలిమేర దాటగానే ప్రభాకరం జేబులోంచి సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టె తీశాడు. తను ఒకటి నోట్లో పెట్టుకుని ఇంకొకటి భాస్కరానికి ఆఫర్ చేశాడు. "అబ్బె వద్దురా! నాకు సిగరెట్లు పడవు" అన్నాడు భాస్కరం.

"ఫరవాలేదు తీసుకోయ్ పెద్ద—ఇక్కడ చూసేవాడెవడూ లేడు. సరదాగా కాసేపు పూది పారేసేదానికి ఏమి టాంత పట్టింపు" అని మొహమాట పెట్టాడు ప్రభాకరం.

"ఇష్టం ఉంటే దర్జాగా పూళ్ళోనే కాల్చొచ్చు. దానికోసం ఇంత దూరం వచ్చి రహస్యంగా కాల్చాలా?"

"బెంగుళూరులో ఉంటూ సిగరెట్లయినా అలవాటు కాలేదంటే ఎవడైనా నమ్ముతాడా—పెద్ద బడాయిగానీ?"

"నమ్మకపోతే పోనీ. నమ్మమని నే నేం బలవంతం చేశానా? అయినా సిగరెట్లు కాల్చేవాడి మొహం




పొగ చూరుకుపోయి కనిపిస్తూనే ఉంటుంది. మొహంలో కనిపించకపోయినా పళ్ళు చూస్తే తెలుస్తుంది. అదీ కాకపోతే చేతి వేళ్ళు చూసి చెప్పవచ్చు. అబద్ధం చెబితే దాగదు."

"సర్లే లేవోయ్. అలవాటుగా కాకపోతే ఎప్పుడైనా సరదాకి కాల్చొచ్చుగా. ఒక సిగరెట్టు వూది పారేస్తే పాపం చుట్టుకుంటుందా ఏం?"

"అది తప్పనీ, పాపమనీ అనడం లేదు. నాకు ఇష్టం లేదు. అంతే. నీకు ఇష్టమైతే కాల్చు— వద్దన్నానా? నాతో పంతం దేనికి?"

"సిగరెట్టు ఒంటరిగా కాల్చడంలో మజా ఉండదురా. సరే ఏం చేస్తాం? నువ్వు అంత పట్టుదలగా ఉంటే నేనే ముట్టిస్తాను" అంటూ సిగరెట్ వెలిగించాడు ప్రభాకరం. పొగ వూదుతూ మళ్ళీ తనే సంభాషణ ప్రారంభించాడు. మధ్య మధ్య భాస్కరం చేతి వేళ్ళు తీసి చూస్తున్నాడు ఓరగా. 'సరదాగా ఎప్పుడైనా ఒకటీ అరా కాలుస్తాడేమో గాని మొత్తం మీద వీడికి సిగరెట్లు అలవాటు లేదు' అని తేల్చేసుకున్నాడు.

"ఈ వెధవ్వూర్లో లైఫ్ యమ బోరు కొడుతోందిరా. పనీ పాటా లేదు. కాలక్షేపం లేదు.

ఫ్రెండ్సూ లేరు. అలవాటయిన వాణ్ణే నాకే ఇలా ఉంటే బెంగుళూరులో ఉండి వచ్చిన నీకు ఎలా ఉందో?''

''నాలుగైదు రోజులుండి పోయేవాణ్ణి నాకు బోరేమిట్రా? బోరు కొట్టేన్ని రోజులు ఉండనే ఉండను కదా? అయినా ఏ ఉద్యోగం లేకుండా, వ్యాపారం లేకుండా వూరికే గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంటే ఎవడికైనా బోరు కొడుతుంది.''

''వ్యాపారం పెట్టేందుకు పెట్టుబడి ఎక్కడేడి సింది గానీ, ఉద్యోగ ప్రయత్నం చేస్తూనే ఉన్నారా నాయనా ... ఇంగ్లీషు పేపరుకి చందా కట్టి తెప్పించుకుని, కనిపించిన ఉద్యోగా లన్నింటికీ అప్లికేషనులు పెడుతూనే ఉన్నాను. ఇంటర్వ్యూల కోసం బెజవాడ, ఏలూరు, రాజమండ్రి లాంటి వూళ్ళన్నీ వెళ్ళివస్తున్నాను. రెండుసార్లు హైదరాబాద్ కూడా వెళ్ళాను. ప్రయాణం ఖర్చులూ, పోస్టు ఖర్చులూ తప్ప ప్రయోజనం ఏమీ కనిపించలా. ఎక్కడికి పోయినా చప్రాసీ ఉద్యోగానిక్కూడా రికమెండేషను. విసుగెత్తిపోయి ఇక ఇంటర్వ్యూలకి కూడా వెళ్ళడం మానేశాను. పోనీ నువ్వేదో బెంగుళూరులో ఉంటున్నావు కదా. బోలెడు పలుకుబడి ఉంటుంది. పెద్ద పెద్ద వాళ్ళతో పరిచయాలు ఉంటాయి. రికమెండ్ చేసి ఏదైనా గుమాస్తా ఉద్యోగం ఇప్పిస్తావని చూస్తే, నువ్వూ లౌక్యంగా తప్పించుకుంటున్నావు. స్నేహితులే మొహం చాటు వేస్తే ఇంక బయటవాళ్ళ కేం పట్టింది?''

''బెంగుళూరులో ఉంటున్నానంటే నేనేదో పెద్ద పొజిషన్‌లో ఉన్నా ననుకుంటున్నావు కాబోలు. అక్కడ నేను వూరూ పేరూ లేని అనామకుణ్ణిరా, బాబూ. నాకు అక్కడ పలుకుబడీ లేదు, పెద్ద వాళ్ళతో పరిచయాలూ లేవు. నీకు రికమెండ్ చేసేంతటి వాడినైతే నేనే ఒక ఉద్యోగం సంపాదించుకునేవాణ్ణి కదా? ఉద్యోగం దొరక్కనే కదా వ్యాపారం పెట్టింది?''

''ఉద్యోగం దొరక్కనే వ్యాపారం పెట్టావనుకో. ఇప్పుడు వ్యాపారంలో బాగా నిలదొక్కుకున్నావు కనక, నీ కింక ఎవడైనా ఇస్తే మాత్రం ఉద్యోగం దేనికి? తలుచుకుంటే నువ్వే ఇతర్లకి ఉద్యోగా లివ్వగలవు. పోనీ నీ ఆఫీసులోనే నా కో గుమాస్తా ఉద్యోగం ఇవ్వరా. నీ కింద పని చెయ్యడానికి నాకేం నామోషీ లేదు.''

''నాకు ఆఫీ సెక్కడేడిసిందిరా, నాయనా నీకు ఇవ్వడానికి?''

''ఇష్టం లేకపోతే లేదని చెప్పు. అంతేగానీ ఆఫీసే లేదంటా వేంరా? ఆఫీసు లేకుండా, గుమాస్తాలూ, టైపిస్టులూ లేకుండా వ్యాపారం ఎలా చేస్తున్నావురా?''

''నువ్వు నమ్మకపోతే నేనేం చెయ్యను? నా కో ఆఫీసూ లేదు, నా దగ్గర పనివాళ్ళూ లేరు. నాది అంత పెద్ద వ్యాపారమేం కాదు.''

''సరే ... ఏం చేస్తాం? ఇంతకీ నాకు ఉద్యోగం రాత లేదు. వ్యాపారం అన్న తర్వాత అంతకంతకి పెరుగుతుంది కదా? రేపు నీ వ్యాపారం బాగా పెరిగితే, చేతి కింద ఉద్యోగులు అవసరమైతే నన్ను కాస్త జ్ఞాపకం పెట్టుకో, అప్పటికింకా నేను ఇలా నిరుద్యోగిగా ఉంటే నా కో ఉద్యోగం ఇవ్వు.''

''నాది అలా అంచెలంచెలుగా పెరిగే వ్యాపారం కాదురా నాయనా. ఎప్పుడూ ఇదే లెవెల్లో ఉంటుంది. అందుకని నా మీద ఆశ పెట్టుకోకు.''

''సరేలేరా ... ఈ వెధవ ఉద్యోగాల సంగతి మానేద్దాం కాసేపు. బెంగుళూరు విశేషాలేమన్నా చెప్పరా'' అన్నాడు ప్రభాకరం ప్లేటు మారుస్తూ.

ఇంతవరకు జరిగిన సంభాషణవల్ల భాస్కరం వ్యాపారం ఎలా ఉంటుందో తెలియక పోయినా, ఎలా ఉండదో కొంతవరకు తెలిసింది. ఆఫీసు, గుమాస్తాలు, టైపిస్టులు ఉండే వ్యాపారం కాదు. అంతకంతకు అభివృద్ధి అయేది కాదు. పెద్దవాళ్ళతో పరిచయాలుండే వ్యాపారం కాదు. ఈ సంభాషణ ఇదే మాదిరిగా సాగితే తన కూపీ లాగుతున్నట్లు భాస్కరానికి తెలిసిపోతుంది. అందుచేత టాపిక్ మార్చడం మంచి దనుకున్నాడు.

తన వ్యాపార రహస్యం తెలుసుకోవడానికి ప్రభాకరం పడుతున్న అవస్థ చూస్తుంటే భాస్కరానికి మనస్సులో ఒకటే నవ్వుగా ఉంది. 'చూద్దాం ఇంకా ఎన్ని రకాలుగా ప్రశ్నలు వేస్తాడో' అను

TP.G.30 TL



"కర్కశంగా, గరుకుగాఉండే పళ్లపొడులు మీ పళ్లకు, చిగుళ్లకు హానికలిగించవచ్చు..."

# కోల్గేట్ టూత్ పౌడర్‌తో మీ చిగుళ్ళను, చెడుశ్వాసను కూడా అరికట్టండి, పళ్ళను కాపాడుకోండి.

కోల్గేట్ టూత్ పౌడర్ ఎంతో మెత్తగా ఉండే తెల్లని పౌడర్. అది అతి మృదువుగా మీ చిగుళ్ళను తోముతుంది. అంతేగాకుండా దానిలో ఉండే సున్నితమైన మెరుగునిచ్చే పదార్థం మీ పళ్ళ మీది పాచిపొరలను తొలగిస్తుంది. మీ పళ్ళను శుభ్రపరచి తెల్లగా చేస్తుంది. కోల్గేట్‌లోని పుష్కలమైన నురుగునిచ్చే చర్య పళ్ళ సందులలోనికి చొచ్చుకుపోయి చెడు వాసనను దంతక్షయకారకములైన సూక్ష్మ క్రిములను తొలగిస్తుంది.

**మీ కుటుంబానికి కోల్గేట్ టూత్ పౌడర్‌తో అధునాతనమైన తీరులో దంతరక్షణ సమకూర్చండి. దానియొక్క చల్లని, పిప్పర్‌మెంట్ రుచిని వారంతా మెచ్చుకుంటారు.**



కున్నాడు. 'నా వ్యాపారం ఇది' అని చెప్పుకోవచ్చుగానీ, ప్రభాకరం అడిగే ప్రశ్నలకు సమాధానంగా తను అబద్ధాలు చెప్పాల్సిన అవసరం లేదు.

భాస్కరం అబద్ధం చెప్పడనే నమ్మకం ప్రభాకరానికీ ఉంది. "బెంగుళూరులో లైఫ్ మాంఛి హుషారుగా ఉంటుందట కదురా? అసలు తోచక పోవడం అంటూ ఉండదట. పెద్ద సిటీ ఆయెను. బోలెడు కాలక్షేపాలుంటాయి. సినిమాలు, క్లబ్బులు, బార్‌లు, రేసులు ..."

"సిటీలో కాలక్షేపాలకేం కొదవ? డబ్బు, మోజు ఉండాలిగాని బోలెడు వ్యసనాలు. సంపాదించడం కష్టంగానీ తగలెయ్యడం మహా తేలిక. అవన్నీ డబ్బుగల వాళ్ళకి గానీ మనలాటి వాళ్ళకి కాదు."

"అంత బీదరుపులు అరుస్తావేరా నెలకి వెయ్యి పైగా సంపాదిస్తూ? క్లబ్బులో పేకాడితేమాత్రం, రేసులాడితేమాత్రం ఎప్పుడూ పోతుందా ఏం? వస్తూంటుంది, పోతూంటుంది. నేను పేకాడితే పోయేదానికంటే వచ్చేదే ఎక్కువగా ఉంటుంది. కాని, నా దగ్గర డబ్బులున్నప్పుడు ఆడేందుకు ఎవ్వడూ ఉండడు. నీ కా సమస్య ఉండదు కదా? క్లబ్బుకి వెడితే బోల్డంతమంది దొరుకుతారు."

"నా కసలు జూదం అంటే గిట్టదురా, బాబూ. పేకాట ఎవరైనా ఆడుతుండగా చూస్తేనే నాకు చిరాగ్గా ఉంటుంది."

"పేకాట కాకపోతే రేసులు... దాం దుంపతెగ ... జీవితంలో ఏదో ఒక ఎడ్వెంచర్ లేకపోతే ఎల్లారా? ఉద్యోగం సద్యోగం లేక ఈ పల్లెటూర్లో పడి చస్తున్నాను గానీ, సిటీలో ఉంటే చూపించేవాణ్ణి తడాఖా. వెధవది ... ఉద్యోగంలో, వ్యాపారంలో ఏం సంపాదిస్తాంరా? లక్కీ ఛాన్సుగా జాక్‌పాట్ తగిలితే జీవితం అంతా కాలుమీద కాలేసుక్కుని రాజాలాగా అనుభవించ వచ్చు. అసలు ఒకసారి బెంగుళూరు వచ్చి చూడాల్రా రేసుల సంగతేమిటో! సినిమాల్లో తప్ప ఒక్కసారైనా నిజంగా రేసులు చూళ్ళేదంటే షేమ్‌గా ఉంది. అవునుగాని ... జాక్‌పాట్ టిక్కెట్టు ఎంతుంటుందిరా?"

"నే నెప్పుడూ రేస్‌కోర్స్ గోడ పక్కగా నడవనైనా లేదురా, బాబూ ... నన్నడిగితే నాకేం తెలుస్తాయి అవన్నీ? తెలుసుకోమంటే బెంగుళూరు వెళ్ళిన తర్వాత ఎవణ్ణయినా అడిగి నీకు ఉత్తరం రాస్తాను."

"నీకూ నాకూ చుక్కెదుర్రా ... నా కిష్టమైనవేవీ నీకు ఇష్టంలేదు. నాక్కావలసిన ఇన్ఫర్మేషన్ ఇవ్వలేవు. అసలు నీ లాంటి వాడు బెంగుళూరులో ఉండడం దండగరా ... అనుభవించడం చేతకానివాడు సిటీలో ఉన్నా, పల్లెటూర్లో ఉన్నా ఒకటే. సరదాగా ఎప్పుడైనా బెంగుళూరు వస్తే కనీసం బార్‌కైనా తీసుకెళ్ళేటట్టు లేవు నీ ధోరణిచూస్తే ..."

"సారీ, మై డియర్ ఫ్రెండ్ ... నా మీద అటువంటి ఆశలు పెట్టుకోకు. నా కవన్నీ అలవాటూ లేదు, ఆసక్తీ లేదు. నువ్వువస్తే ఒక్కడివీ వెళ్ళు. నాకేం అభ్యంతరం లేదు."

"నీ కంటే మన వెంకట్రావు నయంరా ... ఇంటర్వ్యూకోసం హైదరాబాద్ వెళ్ళినప్పుడు బార్‌కి తీసుకెళ్ళి బీర్ ఇప్పించాడు. సరేగానీ, అసలు సరదాకైనా బార్‌కీ, రేసుంకీ, క్లబ్బుంకీ వెళ్ళకపోతే తీరిక సమయాలలో ఎలా కాలక్షేపం అవుతుందిరా నీకు?"

"లైబ్రరీకి పోతాను. రూమ్‌కి పుస్తకాలు తెచ్చుకుంటాను. ఎప్పుడైనా సినిమాకి పోతాను. నాకేం బోర్ కొట్టడం లేదు లైఫ్."

"అదృష్టవంతుడివిరా, నాయనా" అన్నాడు ప్రభాకరం సిగరెట్టు చివరి దమ్ము పూది అవతల పడేస్తూ. "ఇప్పేమిట్లే — నా కంటే అందరూ అదృష్టవంతులే. చిన్నప్పటి మన బ్యాచ్ వాళ్ళలో నాకు తప్ప అందరికీ ఉద్యోగాలు దొరికాయి. అది సరేగానీ, బెంగుళూరులో కాస్టాఫ్ లివింగ్ చాలా ఎక్కువేంరా?"

"ఆఁ ... ఎక్కువే. హైదరాబాద్‌కంటే, మద్రాస్ కంటే ఎక్కువే."

"ఒక మనిషికి ఎంతవుతుం దంటావ్ నెలకి?"

"అది మనం చేసే ఖర్చునుబట్టి ఉంటుంది. బీదా బిక్కీ జనం కూడా సిటీల్లో బతుకుతున్నారు కదా?"

"అది కాదురా ... కాస్త చౌకరకం హోటల్లో రెండు పూటలా భోజనం, రెండు పూటలా కాఫీ, ఒక



చిన్న గది ... ఎంతవుతుంది?''

"మూడొందల రూపాయలతో బతికెయ్యొచ్చు."

"నీకు నో అయిదొందల దాకా ఖర్చవుతుంది అనుకుంటా?''

"అవుతుంది.''

"నీ రూమ్‌కి అద్దె ఎంతరా?''

"ఎనభై."

"బెంగుళూరులో నెలకి ఎనభై అంటే చీప్ కదురా?''

"ఏం చీప్‌రా ... నేనుండేది కాస్త చౌకరకం హోటల్లో. మా రూమ్‌లో ముగ్గురం ఉంటున్నాం. ముగ్గురం మూడు ఎనభైలు ఇస్తున్నాం."

"ఆ! హోటల్లో ఉంటున్నావా? చెప్పవుకావేం ఇందాకట్నుంచీ ... అయితే కాలక్షేపానికేం తక్కువ? బలే మజాగా ఉంటుందనుకుంటాను."

భాస్కరం అర్థంకానట్లు మొహం చిట్లించి చూశాడు ప్రశ్నార్థకంగా.

"రోజూ గాజుల గలగల వినిపిస్తుందన్న మాట!'' అన్నాడు ప్రభాకరం కొంచెం రహస్యంగా.

"ఛీ... వెధవ మాటలూ నువ్వూను. ఇంత చౌకబారుగా మాట్లాడతావేంరా?'' అని చీదరించుకున్నాడు భాస్కరం.

"అబ్బెబ్బే లేదురా. పొరపాటున నోరు జారింది. ఆ వెంకట్రావు గాడి దగ్గర మాటాడే మాటలు నీ దగ్గర దొర్లాయి అలవాటు ప్రకారం. వాడు బలే జల్సారాయుడులే. అయినా నీకు బొత్తిగా సెన్సాఫ్ హ్యూమర్ లేదురా. సరదాకి అన్న మాటలని సీరియస్‌గా తీసుకుంటావు'' అన్నాడు ప్రభాకరం.

"చీకటి పడుతూంది—లేవరా. ఇంక పోదాం'' అన్నాడు భాస్కరం.

ఇద్దరూ లేచి వూరివైపు నడక ప్రారంభించారు.

"బెంగుళూరులో నీ షాపుకి అద్దె ఎంతరా?'' ప్రభాకరం మళ్ళీ సంభాషణ ప్రారంభించాడు.

"నాకు షాపేమిట్రా?''

"షాపు కాకపోతే గోడౌను."

"షాపూ లేదు, గోడౌనూ లేదు."

"మరి సరుకు ఎక్కడ నిలవ చేస్తావురా?''

"సరుకేమిటి?''

"ఇది మరీ బాగుంది. వ్యాపారం చేస్తూ సరుకేమిటంటావేమిట్రా? ఆఫీసు లేకుండా, షాపు లేకుండా, గోడౌను లేకుండా, అసలు సరుకే లేకుండా చేసేది ఇదేం వ్యాపారంరా బాబూ... ఎక్కడా వినలేదు. అసలు వ్యాపారం అంటే ఏమిటి? సరుకు తక్కువ ధరకు కొని ఎక్కువ ధరకు అమ్మడమే కదా?''

"అవును నిజమే... నేను కాదన్నానా?''

"మరి సరుకంటే ఆశ్చర్యపోతున్నట్టు నటిస్తావేం?''

"నేను కొని అమ్మే వాటిని సరుకు అనడం అంత బాగా ఉండదు. వాటి కోసం ఆఫీసు, షాపు, గోడౌను లాంటి వేవీ అవసరం లేదు."

"పోనీ సరుకు అంత ఎక్కువగా లేకపోయినా



జమా, ఖర్చు, లెక్క, పత్రం, టాక్సులు, రసీదులు, ఆడిటింగు వగైరాల కోసమైనా ఒక ఆఫీసు గది అక్కర్లేదట్రా? అక్కౌంటు పుస్తకాలు కూడా రూమ్‌లో తలగడ కింద పెట్టేస్తావా ఏమిటి—చోద్యంగా చెబుతావు?''

"నా వ్యాపారానికి ఆ గొడవంతా లేదురా నాయనా. అయినా నా వ్యాపారం గురించి అడక్కురా అని నీకు ఇదివరకు వందసార్లు చెప్పాను. అయినా మళ్ళీ కూపీ లాగడం మొదలు పెట్టావు. ఇంక నువ్వు ఒక్క ప్రశ్న అడిగినా సమాధానం చెప్పేదిలేదు."

"నీ వ్యాపారం సంగతి ఎవడడిగాడోయ్ ఇప్పుడు? బెంగుళూరులో ఏదైనా దుకాణం పెట్టాలంటే అద్దె ఎంతవుతుందోనని అడిగాను. వందనో, రెండొందలనో చెప్పేస్తే ఇన్ని ప్రశ్నలు అడగాల్సిన అవసరం ఉండేది కాదు కదా? నువ్వే అసలు గోడౌనేమిటి, షాపేమిటి అని సాగదీశావు. హైదరాబాద్‌లో కంటే అద్దెలు తక్కువంటే బెంగుళూరులో ఏదైనా ఒక ఏజెన్సీ పెడదామా అని ఆలోచిస్తున్నా. అయినా నీది ఏ వ్యాపారమైతే నాకు దేనికి? ఏదో ఒక సరుకు ఒక చోట కొంటావు. ఇంకో చోట అమ్ముతావు. లాభం జేబులో వేసుకుంటావు. జేబులో పట్టకపోతే బ్యాంకులో వేస్తావు. ఎవడైనా చేసేది అదే. ఇందులో పెద్ద రహస్యం ఏముంది?''

మాటల్లోనే ఇద్దరూ వూళ్ళోకి వచ్చేశారు. భాస్కరం గుడ్‌నైట్ చెప్పాడు. "వెళ్ళేలోగా ఒకసారి కనిపించి పోరా'' అన్నాడు ప్రభాకరం.

"అలాగే'' అన్నాడు భాస్కరం.

● ● ● ●

రాత్రి భోజనాల దగ్గర ప్రభాకరం పూస గుచ్చినట్లు అంతా చెప్పాడు తండ్రికి. వడ్డిస్తూ అంతా విన్నది జానకమ్మగారు. తలుపు చాటునుంచి కాబోయే పెళ్ళి కూతురు నిర్మలకూడా విన్నది. 'ఆయనేదో వ్యాపారం చేసి సంపాదిస్తున్నాడు. బుద్ధిమంతుడనే అందరూ అంటున్నారు. కట్నం లేకుండా చేసుకుంటా నంటున్నాడు. వంక పెట్టడానికి వీల్లేని మనిషి. ఆయన వ్యాపారం ఏమిటో తెలుసుకోవాలని వీళ్ళకి ఎందుకింత పట్టుదల' అని మనస్సులో విసుక్కుంది నిర్మల. జానకమ్మగారూ అలాగే అనుకుంది. ఆ మాటే బయటికి అనేసింది ఆవిడ.

"వూరుకోవే నీ కేం తెలుసు? పిల్లనిస్తున్నప్పుడు వీలున్నంత వరకు నాలుగు విషయాలూ వాకబు చేయవలసిన ధర్మం ఉన్నది. మన వూరి వాడే కదా, మన పరంధామయ్య కొడుకే కదా, కట్నం లేకుండా చేసుకుంటున్నాడు కదా అని కళ్ళు మూసుకుని తాంబూలాలు పుచ్చుకోవడమేనా? రేపు ఏదైనా లోసుగులు వస్తే ముందూ వెనకా చూడకుండా, వాకబు చేయకుండా తొందర పడి చేశాడు సమ్మంధం అని నలుగురూ నన్ను వెలి పెడతారూ?" అని భార్యని మందలించారు రామనాథంగారు.

"సరే, అన్నీ చూసి కుదిర్చిన సమ్మంధాలన్నీ నిరవాకం అవుతున్నాయి గనకనా? ఆ సుందరి కాపురం, శారద కాపురం చూస్తూనే ఉన్నాంగా?"

"అన్నీ చూసి చేసినా లోటు పాట్లు వస్తే అది వాళ్ళ కర్మ. తొందరపడి చెయ్యలేదు—మన ప్రయత్నం మనం చేశామన్న తృప్తి, అయినా ఉంటుంది."

"ఒకటే మాత్రం నమ్మొచ్చు నాన్నా. భాస్కరానికి దుర్వ్యసనా లేవీ లేవు'' అన్నాడు ప్రభాకరం.

"ఏమో ఎవడికి తెలుసు? నువ్వు చెల్లెలి పెళ్ళి కోసం ఆరాలు తీస్తున్నావని కనిపెట్టి మాట్లాడి ఉండచ్చు ఆతను."

"లేదు, నాన్నా. కేవలం ఇవాళ్టి మాటలని బట్టి చెప్పడం లేదు నేను. వాడి ధోరణి చిన్నప్పటినుంచీ తెలుసుగా నాకు. అబద్ధాలు చెప్పే రకం కాదు. ఇష్టం లేకపోతే అసలు చెప్పనే చెప్పడు గానీ, చెబితే మాత్రం నిజమే చెబుతాడు."

"సరే లేవోయ్. అతని వ్యాపారం సంగతి తేల్లేదు కదా! నువ్వేదో కిటుకు పట్టేస్తావనుకుంటే వెర్రి మొహం వేసుకొచ్చావు."


"ఖచ్చితంగా ఇదీ అని తేలక పోయినా ఆ వ్యాపార లక్షణాలు తెలిశాయి కదా? పెద్ద పెట్టుబడి లేదు. ఆఫీసూ, షాపూ, గోడౌనూ లేదు. సరుకు అనదగినదేమీ లేదు. పన్నులు లేవు. అక్కౌంట్లూ, ఆడిటింగూ లేవు. అంచెలంచెలుగా పెరిగేది కాదు. పార్ట్‌నర్‌షిప్పు, కాంట్రాక్టులు లేవు. ఈ లక్షణాలుగల వ్యాపారం ఏదై ఉంటుందో వూహించి తెలుసుకోవాలి. తెలుసుకోలేకపోతే మెదలకుండ వూరుకోవాలి. ఇవాళ్టినుంచి ఇంట్లో అందరం వూహాగానాలు ప్రారంభిద్దాం."

"తెలుసుకుంటే తెలుసుకోండి, లేకపోతే లేదు గానీ, ఈ సమ్మంధం మాత్రం పోనీకండి. ఆతన్ని చేసుకోవాలని దానికీ ఉంది'' అని హెచ్చరించింది జానకమ్మగారు.

"పోనీనులేవే. పోనిచ్చేటట్లయితే ఇంత రాద్ధాంతం దేనికి?'' అన్నారు రామనాథంగారు.

తలుపు చాటున ఉన్న నిర్మల సంతోషించింది ఆ మాటలు విని.

(సశేషం)




# వ్యాపార రహస్యం

నండూరి పార్థసారథి

అన్నీ కొని, ఇంట్లో ఎక్కడి వక్కడ సర్దేశాడు. హోటలునుంచి ఇంట్లోకి మకాం మార్చేశాడు.

• • • •

అనుకున్న ముహూర్తానికి వివాహం సలక్షణంగా జరిగిపోయింది. అమ్మాయీ, అబ్బాయీ చాలా అందమైన జంట అని పెళ్ళికి వచ్చిన వాళ్ళంతా అనుకున్నారు. "ఇంతకీ పిల్ల అదృష్టవంతురాలు" అని చాలా మంది అన్నారు.

"అదృష్టమంటే నీ దయ్యా, రామనాథం! దమ్మిడీ కట్నం లేకుండా రత్నంలాంటి అల్లుణ్ణి సంపాదించావు" అని కొందరు రామనాథం గారిని అభినందించారు.


పెళ్ళికూతురుకి కావలసిన పట్టు చీరలు, కొద్దిగా నగలు, మధుపర్కాలు వగైరాలు అన్నీ అత్త రాసిచ్చిన జాబితా ప్రకారం భాస్కరం బెంగుళూరులోనే కొని తీసుకొచ్చాడు. అవన్నీచూసి అమ్మలక్కలంతా 'ఆహా ... ఎంత జాగర్తగలవాడు కుర్రాడు' అని మెచ్చుకున్నారు.

పెళ్ళయిన వారం రోజులకి శాస్త్రులు గారు నిర్ణయించిన ముహూర్తానికి భాస్కరం నిర్మలను తీసుకుని బయల్దేరాడు. అమ్మాయికీ, అల్లుడికి కన్నీళ్ళతో వీడ్కోలు ఇచ్చారు రామనాథంగారు, జానకమ్మగారు.

• • • •

వారం తిరక్కుండా నిర్మలనుంచి ఉత్తరం వచ్చింది ఆ ఉత్తరం చదువుకుని తల్లి దండ్రులు మురిసి పోయారు. తమ ఇల్లు చిన్నదైనా అందంగా, సౌకర్యంగా ఉందనీ, ఇంట్లో దేనికీ తడుముకోవలసిన అవసరం లేకుండా సమస్త వస్తువులు అల్లుడుగారు కొని సిద్ధంగా అమర్చి పెట్టారనీ, బెంగుళూరు నగరం చాలా అందంగా ఉందనీ రాసింది నిర్మల. తరవాత పదేసి రోజుల కొకటి చొప్పున నిర్మల నుంచి ఉత్తరాలు వస్తూనే ఉన్నాయి. ఆమె చాలా సంతోషంగా ఉన్నట్లు, ఏ ఇబ్బందీ లేనట్లు ఉత్తరాల వల్ల తెలుస్తోంది. వీలు చూసుకుని ఎప్పుడైనా వచ్చి తను దగ్గర ఒక నెల్లాళ్ళు ఉండి పొమ్మని రాసింది నిర్మల. భాస్కరంకూడా ఒక ఉత్తరంలో మామగారిని, అత్తగారిని, బావమరిదిని ఆహ్వానించాడు. వీళ్ళకీ ఒకసారి వెళ్ళి చూడాలనే ఉంది. కాని, ఇలా వెళ్ళి అలా వచ్చేందుకు దగ్గిరా దాపా, దూరా భారమాయెను. ప్రయాణానికే వందలు అరిపోతాయి. మనం ఎక్కడ వెళ్ళగలం. ఏదో వాళ్ళిద్దరూ చిలకా గోరింకల్లాగా హాయిగా కాపరం చేస్తున్నారు. వాళ్ళను గురించి దిగుల్లేదు. ఏ పండక్కో రమ్మని రాస్తే వాళ్ళే వస్తారు" అని మురుస్తున్నారు రామనాథంగారు, జానకమ్మగారు.

ప్రభాకరానికి మాత్రం మళ్ళీ బుర్ర తొలిచడం ప్రారంభించింది. పల్లెటూళ్ళో బతుకు దుర్భరంగా ఉంది. ఉద్యోగం దొరకదు. ఇప్పటికే నలుగురి దృష్టిలో అప్రయోజకుడిగా తయారయ్యాడు. తెగించి సిటీకి పోయి తన బతుకు తనుచూసుకోవాలి. ముందుభాస్కరం చేసే వ్యాపారం ఏమిటో తెల్సుకుంటే తన మార్గం సుగమం అవుతుంది. భాస్కరం అడుగు జాడల్లో నడవడం తప్ప ఇంకో ఉపాయం కనిపించడం లేదు తనకి. 'ఒక్కసారి బెంగుళూరు వెళ్ళి రావాలి. సిటీ




చూసినట్టూ అవుతుంది. చెల్లెలి కాపరం చూసి నట్టూ అవుతుంది. బతుకు తెరువు దొరికినట్టూ అవుతుంది' అనుకున్నాడు. ఆ మాటే తండ్రికీ చెప్పాడు. ఆయనకీ సబబుగానే అనిపించింది. జానకమ్మ గారూ వెళ్ళి రమ్మంది. "మేమిద్దరం వెళ్ళి రవా లంటే బోలెడు ఖర్చు. పోనీ నువ్వైనా వెళ్ళి వాళ్ళని చూసిరా. ఎలా ఉంటున్నారో ఏమిటో" అంది.

రామనాధంగారు ఎలాగో డబ్బుపుట్టించి కొడుకుని రైలెక్కించాడు. ముందుగా ఉత్తరం రాసి వెళ్ళడం కంటే, ఇన్‌కంటాక్స్ అధికారుల ఆకస్మిక దాడుల మాదిరిగా వాళ్ళఇంటిమీద దాడిచేస్తే రెడ్‌హేండెడ్‌గా వాళ్ళ బండారం బయట పడుతుందనుకున్నాడు ప్రభాకరం. అందుకే ముందుగా ఉత్తరం రాయకుండా బయలుదేరాడు. తలిదండ్రులతో మాత్రం ఉత్తరం రాసినట్లు చెప్పాడు.

• • • •

బెంగుళూరులో అట్టే శ్రమ పడకుండనే అడ్రసు ప్రకారం ఇల్లు కనుక్కో గలిగాడు. ప్రభాకరాన్ని చూడగానే నిర్మలకి, భాస్కరానికి ఆశ్చ ర్యం, ఆనందం కలిగాయి.

"ఇదేమిట్రోయ్! ఉత్తరమ్మక్క రాయకుండా ఇలా హఠాత్తుగా వచ్చావ్?" అన్నాడు భాస్కరం.

"మూడ్రోజుల కిందటే రాశానే. ఇంకా చేరలేదన్న మాట. నువ్వు స్టేషనుకి రాలేదేమిటా అనుకున్నాను. ఉత్తరం అందలేదేమో అనుకుని, అడ్రసు వెతు క్కుంటూ వచ్చాను" అన్నాడు ప్రభాకరం.

ఒక్కసారి కళ్ళతో హాలు అంతా సర్వే చేశాడు. 'చాలా బాగుందిరా మీ ఇల్లు" అని మెచ్చుకున్నాడు. తరవాత స్నానం, భోజనం అన్నీ అయ్యేలోగా ఇంట్లో మనుషులనీ, సామాన్లనీ ఒక్క విడత తనిఖీ చేశాడు. అనుమానించ దగిన దేదీ కనిపించ లేదు. బండారం అనదగిన దేదీ బయట పడలేదు. ఇల్లు శుభ్రంగా, కుదుమట్టంగా, ముచ్చటగా ఉంది. సోఫాకంబెడ్, రేడియో, గ్రామఫోన్, గాడ్రెజ బీరువా, జంట మంచాలు, డైనింగ్ టేబుల్, వంటింట్లో స్టీలు సామాను అన్నీ ఉన్నాయి. అన్నీ చక్కగా సర్దినట్లు ఉన్నాయి. ఇంటికి ఎవరో అతిధి వస్తాడంటే అమర్చి నట్లుగా ఉన్నాయి. చెల్లాయి భాస్కరం చాలా సంతోషంగా ఉన్నారు. అన్యోన్యంగా ఉన్నారు. 'వీళ్ళ కాపరం చూస్తే అమ్మా, నాన్న సంతోషిస్తారు" అనుకున్నాడు మనస్సులో.

భాస్కరం బయటికి వెళ్ళడానికి బయలుదేరుతూ "నేను పని మీద వెళుతున్నా. మళ్ళీ మూడు గంటలకి వస్తా" అని చెప్పాడు.

భాస్కరం వెళ్ళగానే ప్రభాకరం నెమ్మదిగా చెల్లెలిని కబుర్లలోకి దింపి ,"ఇంతకీ మీ ఆయన చేసే వ్యాపారం ఏమిటే?" అనడిగాడు.

"ఈ విషయ పరిశోధించడానికా నువ్వు ఇంత దూరం వచ్చింది?" అంది నిర్మల.

"అబ్బే! అది కాదే ... మిమ్మల్నిద్దర్నీ చూసి పోదామనే వచ్చాను. అయినా భాస్కరం ఇంకా వ్యాపా రాన్ని అంత రహస్యంగా ఉంచాడా అనుకున్నాను. రహస్యమైతే చెప్పద్దులే."

"చెప్పాలంటే మాత్రం నాకు తెలిస్తేకదా నీకు చెప్పడం."

"నీకూ్కడా చెప్పలేదా? ఆశ్చర్యంగా ఉందే! తెలుసుకోవాలని నీకు అనిపించలేదా? పెళ్ళానిక్కూడా తెలీకుండా ఎవడైతేమట్టుకు వ్యాపారం ఎలా చెయ్య గలడబ్బా!"

"ఆయన ఎప్పుడూ చెప్పలేదు. నేను అడగలేదు. తెలుసుకోవాలన్న కుతూహలం నాకు లేదు. అందుకే ప్రయత్నించలేదు. ఇష్టం లేనప్పుడు బలవంతంగా చెప్పించడం దేనికి? సంపాయించి తెస్తున్నారు. నాకు ఏ లోపం చెయ్యడం లేదు. నేను అడిగిన వన్నీ కొని తెస్తారు. మా జీవితం హాయిగా గడుస్తోంది. ఇంత కంటే ఎవరైతే మాత్రం కోరుకునే దేమీ ఉంటుంది? ఆయన వ్యాపారం ఏదైతే నాకేం?"

"అవునవును ... ఏ వ్యాపారమైతేనేం సంపాదన ముఖ్యంగాని. అది సరే. భాస్కరం టయిమింగ్స్ ఏమిటే? ఎప్పుడు వెళ్ళి ఎప్పుడొస్తాడు? సెలవు ఎప్పుడు?"

"పొద్దున్న పది గంటల ప్రాంతంలో వెళ్ళి 12 గంటలకి వచ్చేస్తారు. తర్వాత రాత్రి తొమ్మిది దాకా వెడుతూ వస్తూ ఉంటారు."

"వోహో ... వాడు బిజినెస్ చేసేది ఏ ఏరియాలో?"

"అదుగో—నువ్వు మళ్ళీ కూపీ తీసేట్లున్నావ్? అవన్నీ నాకు తెలియవు. ఇటువంటి ప్రశ్నలన్నీ అడిగి, ఆయనకి కోపం తెప్పించకు. ఆయన వెడు తుంటే నువ్వు వెంటబడి వెళ్ళకు. ఆయనకి తీరిగ్గా ఉన్నప్పుడు ఆయనే నిన్ను తీసుకెళ్ళి వూరు చూపి స్తారు."

• • • •

ఇంక వీళ్ళని అడిగి లాభం లేదనీ, వీళ్ళకి తెలీకుండా తనే స్వయంగా పరిశోధించాలనీ అనుకున్నాడు ప్రభాకరం. రెండు రోజులు రకరకాల ప్లాన్లు వేశాడు, కొట్టేశాడు. చివరికి ఒక ఉపాయం తోచింది. మూడోరోజు పొద్దున్న అలా వెళ్ళి వూరుచూసి వస్తానని భాస్కరం కంటే ఒక అరగంట ముందుగా ఇంట్లోంచి వెళ్ళిపోయాడు. వెళ్ళిన వాడు ఇంటికి దగ్గరగా ఉన్న బస్ స్టాప్‌కి కొంతదూరంలో కాపలా వేశాడు. బస్ స్టాండు దగ్గరనుంచి చూసేవాళ్ళకి తను కనుపించకుండా ఒక చెట్టు చాటున నించు న్నాడు. కొంతసేపటికి భాస్కరం బస్‌స్టాప్ దగ్గరికి వచ్చాడు. అతను బస్సు ఎక్కగానే ప్రభాకరం ఆటో ఎక్కి, బస్సును ఫాలో కమ్మన్నాడు.

భాస్కరం కెంపెగౌడా సర్కిల్ దగ్గర బస్సు దిగాడు. అతను దిగడం చూసి ప్రభాకరం ఆటో దిగాడు. భాస్కరానికి ఒక అరఫర్లాంగు వెనక ఉండి ఫాలో అయ్యాడు. భాస్కరం కెంపెగౌడా రోడ్డులో నడుస్తున్నాడు. ప్రభాకరం ఆ రోడ్డును అటూ ఇటూ, పరకాయించి చూశాడు. రోడ్డు చాలా అందంగా ఉంది. అటూ ఇటూ పెద్ద పెద్ద అంద మైన సినిమా థియేటర్లు, బాంకులు, హోటళ్ళు, బట్టల షాపులు ఉన్నాయి. భాస్కరం ఒక పెద్ద సినిమా థియేటర్‌లోకి వెళ్ళి, క్యూలో నించున్నాడు. క్యూ చాలా పొడుగు ఉంది. అది ఆ రోజే విడుదలయిన సరికొత్త సినిమా

"భాస్కరం నన్ను, చెల్లాయిని తీసుకెళ్ళకుండా ఒక్కడూ సినిమాకు వెడుతున్నా డేమిటి?" అను కున్నాడు ప్రభాకరం. టైము చూస్తే మార్నింగ్ షో టయిము దాటిపోయింది. టిక్కెట్లు తీసు కున్న వాళ్ళు బైటకు వచ్చేస్తున్నారు. వోహో అడ్వాన్స్ బుకింగ్ కాబోలు. అయితే ఇవాళ భాస్కరం సినిమాకు తీసుకు వెడతాడు కాబోలు అనుకున్నాడు. కాసేపటికి భాస్కరం టిక్కెట్లు తీసుకుని బైటకు రావడం కనిపించింది. అతనికి కనిపించకుండా ఒక చెట్టుచాటున నించున్నాడు ప్రభాకరం. తర్వాత మళ్ళీ భాస్కరాన్ని వెనక నుంచి ఫాలో అయ్యాడు. భాస్కరం మళ్ళీ ఇందాకటి నంబరు బస్సే ఎక్కాడు. 'వోహో ఇంటికి తిరిగి వెళ్ళిపోతున్నట్లున్నాడు' అనుకున్నాడు ప్రభాకరం. ఇంక ఆ బస్సు ఫాలో కావడం అనవసర మనుకున్నాడు. వో గంటసేపు ఆ రోడ్డు అంతా సర్వేచేసి, అక్కడి నుంచి బస్సెక్కి ఇంటికి వెళ్ళాడు.

భోజనం చేసేటప్పుడుగానీ, ఆ తర్వాతగానీ భాస్కరం 'ఇవళ సినిమాకి వెడదాం, టిక్కెట్లు తెచ్చాను' అనలేదు. ఇక ఆ ప్రసావన తెచ్చేటట్లు లేదనే ఉద్దేశంతో ప్రభాకరమే కదిలించాడు "వీ ఊరు వచ్చి మూడు రోజులైనా ఒక్క సినిమా అయినా చూపించావు కావు" అన్నాడు.

"సారీ, ప్రభాకరం! చాలా బిజీగా ఉన్నాను. మధ్యాహ్నం రెండున్నరకి మళ్ళీ వెళ్ళాలి. వచ్చే సోమవారం తప్పకుండా వెడదాం" అన్నాడు భాస్కరం.

'టిక్కెట్లు జేబులో పెట్టుకుని కూడా అబద్ధం ఆడుతున్నాడు. ఇందులో ఏదో లిటిగేషనుంది. అది ఏమిటో తేల్చాలి' అనుకున్నాడు ప్రభాకరం. "సరే ... సోమవారంలోగా నే నొక్కణ్ణే వెళ్ళి లాల్‌బాగ్, కబ్బన్ పార్కు, మ్యూజియం చూసొస్తా" అన్నాడు పైకి.

భాస్కరం రెండున్నరకి బయలు దేరతానన్నాడు కనక తను రెండింటికే ఇంట్లోంచి బయలుదేరి, బస్‌స్టాప్‌కి కాస్త దూరంలో కాపలా వేశాడు. భాస్కరం కాసేపటికి వచ్చి పొద్దున ఎక్కిన బస్సు ఎక్కాడు. ప్రభాకరం పొద్దున మాదిరిగానే ఆటో ఎక్కి ఫాలో అయ్యాడు. భాస్కరం పొద్దుటి థియేటరు దగ్గరికే వెళ్ళాడు. ప్రభాకరం కొంచెం దూరంలో చెట్టు చాటున నక్కి చూస్తున్నాడు.

థియేటర్ దగ్గర జనం గుంపులు గుంపులుగా ఉన్నారు. తోసుకుంటున్నారు, తుమ్ముకుంటున్నారు. రోడ్డుకి అటూ ఇటూ వరసగా ఉన్న అన్ని థియేటర్ల దగ్గర ఇలాగే జనం గుంపులు గుంపులుగా ఉన్నారు. అది మ్యాట్నీ టైము. రోడ్డు అంతా రద్దీ, గోల. భాస్కరం వెళ్ళిన థియేటరు బయట 'హౌస్‌ఫుల్' బోర్డు పెట్టి ఉంది. భాస్కరం థియేటరులోపలికి వెళ్ళలేదు. బయట నుంచున్నాడు స్టైలుగా జేబులో చేతులు పెట్టుకుని. ఎవరితోనో ఏదో మాట్లాడుతున్నాడు. కొంచెం పక్కకి తీసుకెళ్ళి జేబులోంచి టిక్కెట్లు తీసి ఇచ్చాడు. ఆ వ్యక్తి నోట్లు ఇస్తే తీసుకుని జేబులో పెట్టుకున్నాడు. తరవాత ఇంకో పెద్దమనిషికి అలాగే టిక్కెట్లు ఇచ్చి డబ్బు జేబులో వేసుకున్నాడు. ఆ తరవాత ఎవరో ఒకాయన కనిపించేసరికి 'హలో' అంటూ పలకరించి నవ్వుతూ షేక్‌హాండ్ ఇచ్చాడు. తరవాత ఆ మనిషి థియేటర్లోకి వెళ్ళి పోయాడు. భాస్కరం మళ్ళీ జేబులోంచి టిక్కెట్లు తీసి ఇంకో వ్యక్తికి ఇచ్చి నోట్లు జేబులో పెట్టుకున్నాడు. అలా పావు గంటలో ఏడెనిమిది మందికి టిక్కెట్లు ఇచ్చాడు. కొందరికి మూడేసి, నాలుగేసి కూడా ఇచ్చినట్లున్నాడు.

అంటే భాస్కరం కనీసం ఇరవై టిక్కెట్లయినా కొని ఉంటాడు. టిక్కెట్ల పంపిణీ కాగానే భాస్కరం మళ్ళీ బస్ స్టాప్ వైపు నడక ప్రారంభించాడు.

ప్రభాకరం భాస్కరాన్ని ఫాలో కాలేదు. తిన్నగా థియేటరు దగ్గరికి వెళ్ళాడు. మూసేసిన బుకింగ్ కౌంటర్ల దగ్గర ఆశాభంగం పొందిన జనం తచ్చాడుతున్నారు. "హలో. యూ వాంట్ టిక్కెట్? త్రీఫిఫ్టీ క్లాస్ సెవెన్ రుపీస్, ఫోర్‌ఫిఫ్టీ క్లాస్ టెన్‌రుపీస్" అంటూ ఒక వ్యక్తి దగ్గరికి వచ్చి ఇంగ్లీషులో పలకరించాడు. "నో థాంక్స్" అని చెప్పి వచ్చేశాడు. ఆ చుట్టుపక్కల ఉన్న ఏడెనిమిది థియేటర్ల దగ్గరికి వెళ్ళి, రేట్ల వివరాల వాకబు చేశాడు. ఆ వారే రిలీజయిన సినిమా టిక్కెట్లు రోడ్డుమీద రెట్టింపు ధర పలుకుతున్నాయి. రెండవ వారం, మూడో వారం ఆడుతున్న సినిమాల టిక్కెట్లు, రూపాయి, రెండు రూపాయలు ఎక్కువగా అమ్ముడు పోతున్నాయి.

లాల్‌బాగ్, కబ్బన్‌పార్కు చూసి చీకటి పడే వేళకి ఇంటికి చేరాడు ప్రభాకరం. బోలెడు ఖర్చు పెట్టుకుని ఇంత దూరం వచ్చినందుకు మొత్తం మీద వచ్చిన పని అయిందని సంతోషించాడు. తన కొత్త బతుకుకు తెరువు దొరికింది. భాస్కరంతో పోటీ లేకుండా ఈ వ్యాపారం హైదరాబాద్‌లో ప్రారంభించాలని నిశ్చయించుకున్నాడు. బుకింగ్ క్లర్కులకీ, పోలీసులకీ మామూళ్ళు పోను భాస్కరం నెలకి కనీసం పదిహేను వందలయినా సంపాదిస్తూ ఉండవచ్చునని అంచనా వేశాడు. ఈ వ్యాపారంలో బాగా నిలదొక్కుకున్నాడు కనక అంత ధారాళంగా సంపాదించ గలుగుతున్నాడు తను అలా సంపాదించడం సాధ్యం కాదు. ఎన్నో డక్కా మొక్కీలు తినాలి

• • • •

ఆ రాత్రి భోజనాల సమయంలో—"నేను ఎల్లుండి బయలుదేరి వెడదామనుకుంటున్నారా" అన్నాడు, ప్రభాకరం.

"అదేమిట్రా. అప్పుడే వెడతా నంటావ్? వెళ్ళి ఏం చేస్తావ్? పది రోజు లాగి వెళ్ళకూడదట్రా?" అన్నాడు భాస్కరం.

"దేనికిరా. ఉండి ఇక్కడ మాత్రం చేసేదేముంది— రోడ్లు పట్టుకు తిరగడం తప్ప. వచ్చిన పనయింది చూడాలనుకున్నవి చూశాను తెలుసుకోవాలనుకున్నవి తెలుసుకున్నాను. వెళ్ళి ఏదో ఒక బతుకు తెరువు చూసుకోవాలి కదా."

"అయితే ఏం చేద్దామనుకుంటున్నావు? ఏదైనా ఉద్యోగం దొరికేట్టుందా?

"నా కెవడు ఉద్యోగం ఇస్తాడురా? ఏదో మన స్తోమతుకు తగిన వ్యాపారం ప్రారంభిద్దామనుకుంటున్నా."

"మన వూళ్ళోనేనా? ఏమాత్రం పెట్టుబడి?"

"హైదరాబాద్‌లో. అట్టే పెట్టుబడి అవసరం లేని వ్యాపారం చేద్దామని చూస్తున్నా."

"అబ్బో హైదరాబాద్‌లోనే! అక్కడ ఆఫీసు తెరవాలన్నా, దుకాణం పెట్టాలన్నా బోలెడు అద్దె అడ్వాన్సు చెల్లించాల్రా నాయనా. లైసెన్సు సంపాదించాలంటే లంచాలు పెట్టాలి. ఇంతకి హైదరాబాద్‌లో ఎక్కడ నీ వ్యాపారం?"

"ఆర్. టి. సీ క్రాస్ రోడ్సు దగ్గర మొదలు పెట్టాలనుకుంటున్నా వ్యాపారానికి దుకాణం, ఆఫీసు, గొడవులు అక్కర్లేదు. లైసెన్సులు, టాక్సుల బెడద ఉండదు అకౌంట్లు, ఆడిట్ల గొడవ లేదు" అన్నాడు ప్రభాకరం.

భాస్కరం సన్నగా నవ్వాడు "కంగ్రాచ్యులేషన్స్" అన్నాడు.

వాళ్ళ సంభాషణ నిర్మలకి మాత్రం ఏమీ అర్థం కాలేదు.

(సమాప్తం)

